www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న

సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో

పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సీ ఇంచార్జ్ లు కావలెను

ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి

ఫోన్ : 9866338848

సంపుటి: 01 | సంచిక: 08 | హైదరాబాద్ | శనివారం | 29-03-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు


## ఎస్ఎల్బీసీలో మరో డెడ్ బాడీ గుర్తింపు

టన్నెల్ లో ఇప్పటికే రెండు మృతదేహాలు బయటకు

ప్రమాదం జరిగి ఐదు వారాలు

అత్యంత కఠినంగా సాగుతున్న సహాయక చర్యలు

తీవ్రంగా కష్టపడుతున్న రెస్క్యూ టీంలు




02

## మంత్రి పదవుల వేటలో.. హస్తిన బాట..!

02

తెలంగాణ కేబినెట్ విస్తరణపై

కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్

మంత్రి పదవుల కోసం ఆశావహులైన

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ బాట.

అసెంబ్లీ సమావేశాలు ముగిసిందే

తడవుగా ఢిల్లీ విమానం ఎక్కేశారు.

ఒకరు తర్వాత ఒకరు వరుసగా ఢిల్లీకి క్యూ.



# కేసీఆర్ పాలనలో సౌభాగ్యనగరం కాంగ్రెస్ పాలనలో అభాగ్యనగరం

**అభివృద్ధి చేయడం నేర్చుకోండి కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సలహా**

**కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు కేటీఆర్ ఆరోపణలు**



**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ నగర అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో నగరం సౌభాగ్యంగా ఎదిగిందని, కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభాగ్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలోని రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుంచించుకుపోయిందని తెలిపారు. పేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న ప్రభుత్వం, పెద్దల ఆస్తులతో

మిగతా 2వ పేజీలో

**అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోతాం

400 ఎకరాల భూమిని అమ్మాలని నిర్ణయించడం దారుణం

ట్విటర్ లో మండిపడ్డ కేటీఆర్

## కాంగ్రెస్ ఇకనైనా నిజాలు చెప్పాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం

సీఎం అప్పుల విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు

కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్న దానిలో వాస్తవం లేదు

స్వయంగా చెప్పిన ఇరిగేషన్ మంత్రి

ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ



02

## సారీ.. జాతీయ హోదా ఇవ్వలేం

తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదన తిరస్కరించిన కేంద్రం

పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించలేం

జలశక్తిశాఖ లిఖితపూర్వక సమాధానం

02



## ఇంటిస్థలం లేనివాళ్లకు శుభవార్త

డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని..

కలెక్టర్లను ఆదేశించిన మంత్రి పొంగులేటి

మొదటి విడతగా రూ. లక్ష చెల్లించాలంటూ

కలెక్టర్లకు సూచించిన రాష్ట్ర మంత్రి



02

## విష్ణుప్రియ.. విచారణకు సహకరించు

ఆదేశించిన తెలంగాణ హైకోర్టు

బెట్టింగ్ యాప్స్ కేసులో..

కోర్టును ఆశ్రయించిన నటి

స్టే ఇచ్చేందుకు నిరాకరణ




02

## సన్నబియ్యం పథకం ప్రారంభం

బియ్యంతో పాటు పప్పు, ఉప్పు

హుజూర్‌నగర్‌లో పంపిణీ చేసిన

రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



02



02

## దేవాదుల ప్రాజెక్ట్ పైప్‌లైన్ లీక్.. మండిపడిన రైతులు

హన్మకొండలో దేవాదుల ప్రాజెక్ట్ పైప్‌లైన్ లీక్..

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే

నీరు వృథాగా పోతోంది: రైతులు

## మయన్మార్ ను ఆదుకుంటాం

ప్రధాని నరేంద్ర మోదీ

భూకంప ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి

భూకంప దాటికి

బహుళజాతి భవనాలు నేలమట్టం



02



02

## బ్యాంకాక్, మయన్మార్‌లో భారీ భూకంపం..

రిక్టర్ స్కేల్ పై 7.7 తీవ్రత

శుక్రవారం మధ్యాహ్నం భూకంపం

మయన్మార్ మోనివా నగరానికి

తూర్పున 50 కిలోమీటర్ల

దూరంలో భూకంప కేంద్రం

## ఎస్ఎల్బీసీలో మరో డెడ్ బాడీ గుర్తింపు

- **టన్నెల్ లో ఇప్పటికే రెండు మృతదేహాలు బయటకు**
- **ప్రమాదం జరిగి ఐదు వారాలు**
- **అత్యంత కఠినంగా సాగుతున్న సహాయక చర్యలు**
- **తీవ్రంగా కష్టపడుతున్న రెస్క్యూ టీంలు**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాద ఘటనలో ఇప్పటికే రెండు మృతదేహాలు బయటడగా.. మరో మృతదేహాన్ని గుర్తించారు. నేటి సాయంత్రానికి లేదా రేపటి వరకు ఆ డెడ్ బాడీని బయటకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఇప్పటివరకు జరిగిన సహాయక చర్యల ద్వారా కేవలం ఇద్దరిని మాత్రమే బయటకు తీయగలిగారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.


## విష్ణుప్రియ.. విచారణకు సహకరించు

- **ఆదేశించిన తెలంగాణ హైకోర్టు**
- **బెట్టింగ్ యాప్స్ కేసులో..కోర్టును ఆశ్రయించిన నటి**
- **స్టే ఇచ్చేందుకు నిరాకరణ**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్ ):** బెట్టింగ్ యాప్స్ కేసు విషయమై తెలంగాణ హైకోర్టును నటి విష్ణుప్రియ ఆశ్రయించిన విషయం తెలిసిందే. మియాపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి, దర్యాప్తుపై స్టే విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది. విచారణకు సహకరించాలని విష్ణుప్రియను ఆదేశించింది. ఇటు పోలీసులకు సూచన చేసింది. చట్ట ప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేసింది. ఇది ఇలా ఉంటే.. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం చేసిన పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న విషయం విధితమే.

## ఇంటిస్థలం లేనివాళ్లకు శుభవార్త

- **డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని..**
- **కలెక్టర్లను ఆదేశించిన మంత్రి పొంగులేటి**
- **మొదటి విడతగా రూ. లక్ష చెల్లించాలంటూ**
- **కలెక్టర్లకు సూచించిన రాష్ట్ర మంత్రి**



**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** డబుల్ బెడ్ రూం ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంటిస్థలం లేని అర్హులకు ఇళ్లు కేటాయించాలని పేర్కొన్నారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్నటువంటి ఇళ్ల నిర్మాణానికి కూడా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా వారికి ఆర్థికసాయం అందించాలని కలెక్టర్లకు సూచించారు. వీటితోపాటు పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైతే బేస్‌మెంట్ పూర్తి చేశారో ఆ లబ్ధిదారులకు మొదటి విడతగా రూ. లక్ష చెల్లించాలంటూ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు.


## సన్నబియ్యం పథకం ప్రారంభం

- **బియ్యంతో పాటు పప్పు, ఉప్పు**
- **హుజూర్‌నగర్‌లో పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించింది. శుక్రవారం హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తాం. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు ఖర్చు చేస్తున్నాయి' అంటూ మంత్రి ఉత్తమ్ తెలిపారు.



## నేడే ఈ ఏడాదిలో తొలి సూర్యగ్రహణం



**హైదరాబాద్,మార్చి 28(సిద్దిపేట పవర్ ):** ఈ సంవత్సరంలో మొదటి సూర్యగ్రహణం మార్చి 29న సంభవించనుంది.ఈ గ్రహణం మీన రాశిలో సంభవిస్తుంది. కానీ ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. ఇది పాక్షిక సూర్యగ్రహణం.ఈ ఏడాది మొదటి పాక్షిక సూర్యగ్రహణం యూరప్, ఆసియా,ఆఫ్రికా,ఉత్తర అమెరికా,దక్షిణ అమెరికా, అట్లాంటిక్,ఆర్కిటిక్ మహాసముద్రం,బార్బడోస్, బెల్జియం,ఉత్తర బ్రెజిల్, బెర్ముడాలతోపాటు ఫిన్లాండ్, ఇటలీ,ఫ్రాన్స్,జర్మనీ,గ్రీన్లాండ్, హాలండ్,నార్వే,పోలాండ్, పోర్చుగల్,రొమేనియా,ఉత్తర రష్యా,స్పెయిన్,మొరాకో, ఉక్రెయిన్,ఉత్తర అమెరికా తూర్పు ప్రాంతాలు ,ఇంగ్లాండ్ మొదలైన ప్రాంతాల్లో కనిపిస్తుంది. అయితే భారత కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం 2:20 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6:16 గంటలకు ముగుస్తుంది. ఇది పాల్గుణ మాసం కృష్ణ పక్ష అమావాస్య రోజున సంభవించే పాక్షిక సూర్యగ్రహణం. గ్రహణం సందర్భంగా జ్యోతిష్య శాస్త్రం ప్రకారం గ్రహణకాలంలో చేయాల్సిన పరిహారాలు ఏంటి? ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? అసలు గ్రహణకాలంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరమేనా! అని అందరికీ సందేహాలు వస్తుంటాయి. మన దేశంలో కనిపించదు కాబట్టి సూత కాలం అంటూ మనకు ఏమీ ఉండదు. ఎలాంటి జాగ్రత్తలు, పరిహారాలు పాటించాల్సిన అవసరం లేదని జ్యోతిష్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇకనైనా నిజాలు చెప్పాలి

- **ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం**
- **సీఎం రేవంత్ రెడ్డి అప్పుల విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు**
- **కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్న దానిలో వాస్తవం లేదు**
- **స్వయంగా చెప్పిన ఇరిగేషన్ మంత్రి**
- **ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ**



**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇకనైనా నిజాలు మాట్లాడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్ధాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. కాంగ్రెస్ తాము ఇన్నాళ్లు చెప్పినవి అబద్ధాలు అని ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందన్నారు. శాసనమండలిలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు.

## సారీ.. జాతీయ హోదా ఇవ్వలేం

- **వివాదం కోర్టులో ఉన్నందునా..**
- **పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించలేం**
- **జల్‌శక్తిశాఖ లిఖితపూర్వక సమాధానం**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):**

పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలంటూ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. అయితే, ఆ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కృష్ణానదీ జలాలపై తెలంగాణ, ఏపీ మధ్య వివాదం కోర్టులో ఉన్నందున ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమంటూ జల్‌శక్తి శాఖ స్పష్టం చేసింది. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు జల్‌శక్తిశాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను తిరిగి పంపినట్లు లోక్‌సభకు కేంద్ర ప్రభుత్వం వివరించింది.

## కేసీఆర్ పాలనలో సౌభాగ్యనగరం కాంగ్రెస్ పాలనలో అభాగ్యనగరం

మొదటిపేజి తరువాయి

సెటిల్మెంట్లు చేస్తోందని విమర్శించారు. గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు 49% తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ రంగం 41% క్షీణించిందని గణాంకాలతో తెలిపారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాదు, రియల్ వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు.

కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా హితబోధ చేశారు. కూల్చడం కంటే కట్టడాన్ని నేర్చుకోవాలని, అబద్ధాల కన్నా అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. "జాగో తెలంగాణ జాగో!" అంటూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేశారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై కేటీఆర్ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలి

- **కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోతాం**
- **400 ఎకరాల భూమిని అమ్మాలని నిర్ణయించడం దారుణం**
- **ట్విటర్ లో మండిపడ్డ కేటీఆర్**



**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఎక్స్ వేదికగా మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుంది. కంచేగచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాను," అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయి" అని వివరించారు.

కేటీఆర్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, "ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రముగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య" అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో, "ఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!" అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మంత్రి పదవుల వేటలో.. హస్తిన బాట..!

- **తెలంగాణ కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్**
- **మంత్రి పదవుల కోసం ఆశావహులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ బాట.**
- **అసెంబ్లీ సమావేశాలు ముగిసిందే తడవుగా ఢిల్లీ విమానం ఎక్కేశారు.**
- **ఒకరు తర్వాత ఒకరు వరుసగా ఢిల్లీకి క్యూ.**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్ ):** తెలంగాణ కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంత్రి పదవుల కోసం ఆశావహులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ బాట పట్టారు. మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నా.. ప్రయత్నిస్తే పోయేదేముంది? అనుకుంటూ ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను కలిసి మంత్రి మండలిలో ప్రాతినిధ్యం కోసం ఎవరి తిప్పలు వారు పడుతున్నారు. తెలంగాణ కేబినెట్ లో ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. విస్తరణలో భాగంగా ఎంతమందికి అవకాశమిస్తారన్నదానిపై స్పష్టత లేకపోయినా పదవుల కోసం ఆశావహులు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వారు మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ఒక్కొక్కరుగా ఢిల్లీ చేరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిందే తడవుగా ఢిల్లీ విమానం ఎక్కేశారు. ఒకరు తర్వాత ఒకరు వరుసగా ఢిల్లీకి క్యూ కట్టారు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు దేశ రాజధానికి మారినట్లయ్యింది. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బాలునాయక్ ఢిల్లీకి చేరుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లను కలిశారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీకి బయలు దేరారు. అహ్మదాబాద్ లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ(డ్రాఫ్టింగ్ కమిటీ) సమావేశానికి భట్టి హాజరుకానున్నారు. మరోవైపు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రివర్గంలో స్థానం కోరుతున్న కాంగ్రెస్ మాదిగ, లంబాడీ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు సైతం తమ ప్రయత్నాలు చేసేందుకు ఢిల్లీకి పయనమయ్యారు. మరి హస్తిన చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరి ప్రయత్నాలు ఫలించి అమాత్యులయ్యే అదృష్టవంతులెవరన్నది ఏప్రిల్ 3వ తేదీలోగా తేలిపోనుంది.



## బ్యాంకాక్, మయన్మార్‌లో భారీ భూకంపం..

- **రిక్టర్ స్కేల్ పై 7.7 తీవ్రత**
- **శుక్రవారం మధ్యాహ్నం భూకంపం**
- **మయన్మార్ మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం**



**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** మయన్మార్‌లో దేశంలో భారీ భూకంపం నెలకొంది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.7గా నమోదైంది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. సెంట్రల్ మయన్మార్ లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. ప్రకంపనల కారణంగా పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బ్యాంకాక్‌లో ప్రకంపనల తీవ్రత 7.3గా నమోదైంది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బ్యాంకాక్ ప్రకంపనలు సంభవించాయి. పలు భవనాల్లో అలారమ్ మోగడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రకంపనల ధాటికి అనేక భవనాలు ఊగిపోయాయి. ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు, మయన్మార్‌లోనూ అనేక భవనాలు ధ్వంసమైనట్లు తెలిసింది. అయితే.. భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

## మయన్మార్ ను ఆదుకుంటాం

- **ప్రధాని నరేంద్ర మోదీ**
- **భూకంప ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి**
- **భూకంప దాటికి బహుళజాతి భవనాలు నేలమట్టం**



**నేషనల్ బ్యూరో, మార్చి 19(సిద్దిపేట పవర్):** మయన్మార్‌ను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని మయన్మార్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లను భూకంపం కుదిపేసింది. భూకంపం ధాటికి భవనాలు ఊగాయి. బహుళజాతి భవనాలు నేల మట్టమయ్యాయి. ఓ భవనం కూలడంతో శిథిలాల కింద 50 మంది చిక్కుకున్నారు. నేల మట్టమైన భవనాల కింద వేలాది మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ భూకంపంతో వేలాది భారీ నిర్మాణాలు నేల మట్టమయ్యాయి. భారీ ఆస్తి నష్టం సంభవించింది.

ముఖ్యంగా మయన్మార్‌లో వరుసగా స్వల్ప వ్యవధిలో రిక్టర్ స్కేలుపై 7.7,6.4 భూకంప తీవ్రత నమోదైంది. ఆ భూకంపంపై ప్రధాని మోదీ ద్రిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మయన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. అందరి భద్రత, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నట్లు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. భూకంపం ప్రభావం నేపథ్యంలో మయన్మార్, థాయిలాండ్ దేశాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతుంది. అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధమైంది. మయన్మార్ వాయువ్య భాగమైన సాగైంగ్‌కు 16కిలోమీటర్ల దూరంలో 10కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మయన్మార్‌లో గతంలో కూడా సాగైంగ్‌కు భూకంపాలు సంభవించిన చరిత్ర ఉంది. ఈసారి కూడా అదే ప్రాంతంలో భూకంపం రావడం గమనార్హం.

## దేవాదుల ప్రాజెక్ట్ పైప్‌లైన్ లీక్.. మండిపడిన రైతులు

- **హన్మకొండలో దేవాదుల ప్రాజెక్ట్ పైప్‌లైన్ లీక్..**
- **అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నీరు వృథాగా పోతోంది: రైతులు**

**హైదరాబాద్ మార్చి 28(సిద్దిపేట పవర్):** హన్మకొండ జిల్లాలోని సాయిపేటలో దేవాదుల ప్రాజెక్ట్ కు సంబంధించిన పైప్‌లైన్ లీకైంది. దీంతో 40 మీటర్ల ఎత్తు నీరు ఎగిసిపడి వృథాగా పోతోంది. అయితే, ధర్మసాగర్ పంప్‌హౌస్ నుంచి గండిరామారావు రిజర్వాయర్‌లోకి పైప్‌లైన్ విద్యుత్ సబ్ స్టేషన్ పవర్ ఫెయిల్యూర్ కావడంతో మోటర్ ట్రిప్ కావడంతో.. పైప్‌లైన్ డ్యామేజ్ అయ్యింది. అయితే, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నీరు వృథాగా పోతోందని రైతులు మండిపడుతున్నారు.

ఇక, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే దేవాదుల ప్రాజెక్ట్ కు చెందిన పైప్‌లైన్ అయిందని రైతులు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ ను ఎప్పటికప్పుడు చెక్ చేసి మరమ్మత్తులు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం వల్లే భారీగా నీరు వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.





# ప్రగతి పథంలో హుస్నాబాద్

- అక్కన్నపేట మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ నిర్మాణానికి 1.5 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన హుస్నాబాద్ ప్రజలు

**సిద్దిపేట పవర్:**

హుస్నాబాద్ నియోజక వర్గంలోనీ అక్కన్న పేట్ మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి 1.5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ గ్రామ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చొరవ తో అక్కన్న పేట నూతన మండల పరిషత్ కార్యాలయం మంజూరు కావడం పట్ల హుస్నాబాద్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి హుస్నాబాద్ కి రావడం ,తాజాగా అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిధులు మంజూరు కావడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి హుస్నాబాద్ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# ముస్లింలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కేసీఆర్ హయంలో ప్రతి ఏడాది రంజాన్ కిట్లు పంపిణీ చేశారు
- మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు
- రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన 26వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్

**సిద్దిపేట పవర్:మార్చి28**




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో ముస్లింలకు ప్రతి సంవత్సరం రంజాన్ కిట్లను పంపిణీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా విస్మరించిందని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు విమర్శించారు. సిద్దిపేట 26వ వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందించడం గొప్ప కార్యక్రమం ఆయన తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీu నాయకులు రంజాన్ తోపాను కూడా రాజకీయం చేసి పేద ముస్లింలకు అందకుండా చేస్తున్నారన్నారు.సిద్దిపేట మున్సిపల్ పరిధి 26వ వార్డులో కౌన్సిలర్ ప్రవీణ్ ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు రంజాన్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశానుసారం ప్రత్యేకంగా ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలు అందరూ సుఖ సంతోషాలతో రంజాన్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, నాయకులు వజీర్, మల్లేశం, లక్ష్మీనారాయణ, బాబా, మల్లారెడ్డి, సాయి పలువురు పాల్గొన్నారు.




# డిల్లీలో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు

**సిద్దిపేట పవర్:**

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యా ప్రైవేటికరణకు వ్యతిరేకంగా అలాగే యుజిసి గైడ్లెన్స్ ను వ్యతిరేకిస్తూ జరిగిన ధర్నా కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుడికందుల రవి, చంద్లాపురం మధులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రభుత్వ విద్యకు సమానంగా ప్రైవేటు విద్యకు ప్రాధాన్యమిస్తే దేశంలో ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టం జరుగుతుంది అలాగే ప్రభుత్వ విద్యను అందించడం ప్రభుత్వాల బాధ్యత, ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టడం కూడా ప్రభుత్వాల బాధ్యత ఇది గుర్తు పెట్టుకొని విధానాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. అలాగే విద్యపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి హక్కుగా ఉన్న దాన్ని కేవలం మా హాక్కు అనే విధంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుంది దీనివల్ల రాష్ట్రాలకు ఉన్న స్వేచ్ఛకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే యూనివర్సిటీలలో కూడా వైస్ ఛాన్స్లర్ నియామకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సిఫారసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్, జిల్లా నాయకులు వికాస్, ప్రవీణ్, కరుణాకర్, జగన్, కేంద్ర రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదులు శ్రేయస్సు కోసం కృషి చేస్తా..

- సిద్దిపేట నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జనార్ధన్ రెడ్డి

**సిద్దిపేట మార్చి28**

తనపై పూర్తి విశ్వాసం తో తనను నమ్మి గెలిపించిన న్యాయవాదులకు అండగా ఉంటానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేష్ పేర్కొన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా జనార్ధన్ రెడ్డి గెలిచిన సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియా తో మాట్లాడారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమను న్యాయవాదులు తనను గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని రాజకీయా పార్టీల నాయకులతో కలిసి న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని నిర్ణయాలను సమిష్టిగా తీసుకుంటూ సామాజిక న్యాయం పాటిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మి నారాయణ,న్యాయవాదులు పత్రి ప్రకాష్, ఖమ్మం పల్లి యాదగిరి, సాయిబాబా, గోవర్ధన్ రెడ్డి, హరిహర్ రావు,ప్రకాష్, ప్రసాద్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు....

# కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి

- మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేత

**సిద్దిపేట పవర్:మార్చి28**



సిద్దిపేటలో ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్ , ప్రధాన కార్యదర్శి గంప శివకుమార్ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ఆశ్రిత్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో సిద్దిపేటలో పెద్ద ఎత్తున కోనో కార్పస్ మొక్కలు నాటారన్నారు. కానీఇవి మాన వాలికి ముప్పుగా పరిణమించాయన్నారు. సాధారణంగా అన్ని చెట్లు కార్బన్డయాక్సైడ్ పీల్చుకొని ఆక్సిజన్ విడుదల చేస్తాయని కానీ అందుకు భిన్నంగా ఈ చెట్లు ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్డయాక్సైడ్ విడుదల చేయడం వల్ల శ్వాస కోశ సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్లను వెంటనే తొలగించి ఆక్సిజన్ పంచే మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్,సతీష్, శ్రావణ్, బాల కిషన్, రమేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నద్ధం కావాలీ

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట పవర్:**




శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో యాసంగి వరిధన్య కొనుగోలు ప్రక్రియకి సంబంధించి అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

**ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....**

జిల్లాలో 419 వరి ధాన్య కేంద్రాలలో తాలు తీసే యంత్రాలు, తేమశాతం కొలిచే యంత్రాలు, కాంటాలు, టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, తాగునీటి వసతి, ఎలక్ట్రిసిటీ సౌకర్యం ఇతరత్రా అన్ని సౌకర్యాలను సమకూర్చుకొని ఆయా ప్రాంతాలలో వరి కోత జరుగుతున్న క్రమంగా ఏప్రిల్ మొదటి వారం నుండి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. ఈ యాసంగిలో 419 అన్ని కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దొడ్డు రకం కాకుండా సన్న రకం ధాన్యాలను కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో దొడ్డు రకం సన్నరకం ఎన్ని ఎకరాల్లో వేశారు? ఏప్పుడు హార్వెస్టింగ్ చేస్తారనే విషయాలకై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. తేమశాతం రాగానే వెంటనే గన్ని లలో లోడ్ చేసి వివిధ గోదాములకు తరలించేందుకు సరిపడినన్నీ లారీలను అందుబాటులో ఉంచుకోవాలని ట్రాన్స్పోర్ట్ కాంటాక్ట్ లకు తెలిపారు. కేంద్రాల్లో ఎలాంటి ఇల్లీగల్ యాక్టివిటీస్ జరగకుండా చూసుకోవాలని పోలీసు అధికారులకు తెలిపారు. అన్ని కేంద్రాలలో కాంటాలను చెక్ చేయాలని లీగల్ మెథడ్ మెథడాలజీ అధికారులకు తెలిపారు. అకాల వర్షాలు మరియు రాళ్ల వానలు బారిన పడకుండా కేంద్రాలలో తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని మరియు సెంటర్ అధికారులకు వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేస్తే రెండు నుంచి మూడు రోజుల్లోపు రైతుల అకౌంట్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. జిల్లాలో బ్యాంకులలో ధాన్యం కొనుగోలు డబ్బులు జమలో ఇతరత్రా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఎల్డీఎం కి తెలిపారు. క్రితం లాగానే రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతి సహకరించాలని ఎలాంటి జాప్యం చేయకుండా చూసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అందరు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

# ఆర్టీఏ మెంబర్ గా సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు డాక్టర్ లక్కరసు సూర్య వర్మ

**సిద్దిపేట పవర్:**



సిద్దిపేట జిల్లా ఆర్టీఏ రీజినల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబెర్ గా సిద్దిపేటకు చెందిన సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు డాక్టర్ సూర్య వర్మని నియమిస్తూ హైదరాబాద్ లోని తన నివాసంలో నియామక పత్రం అందజేశారు రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కష్ట సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకి తగిన ప్రాముఖ్యత ఉంటుందనీ దానికీ సూర్య వర్మ ఉదాహరణ అని అన్నారు.సిద్దిపేట నియోజకవర్గంలో నామినేట్ పదవులలో బీసీలకు అవకాశాన్ని కల్పిస్తూ నియోజకవర్గంలో మొదటగా సూర్య వర్మను నియమిస్తూ శుక్రవారం నియామక పత్రం అందజేమని నేటి నుండి పూర్తి స్థాయిలో ఈ నియమకాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.డాక్టర్ సూర్య వర్మ మాట్లాడుతూ ఈ ప్రజా ప్రభుత్వంలో కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి సరైన సముచిత స్థానం కల్పిస్తున్నందుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలిపారు.తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేశారు.



# ముఖ్యమంత్రినీ కలిసిన నాగపురి కుటుంబం

**సిద్దిపేట పవర్:**

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని బడ్జెట్ సందర్భంగా అసెంబ్లీలో మర్యాద పూర్వకముగా కలిసిన మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్. మొట్టమొదటిసారిగా భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రం చేసిన బీసీ కులగణనతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదం పొందడంలో ముఖ్యపాత్ర పోషించిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి

కొమురవెల్లి మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఐనాపూర్ మసీదులో మండలంలోని ముస్లిం సోదరులందరికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి విందు భోజనాల వలన స్నేహాలు విల్ల విరిసి ఆత్మీయ సంబంధాలు బలపడతాయన్నారు. ఇది దైవ కార్యంగా భావించి చేస్తే మానవత్వానికి దైవత్వం తోడవుతుందన్నారు.

